క్లుప్తంగా

11న సున్నా వడ్డీ రాయితీ విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: మండలంలోని 17,343 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు సున్నా వడ్డీ రాయితీగా రూ.2.19 కోట్లు నిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 11న విడుదల కానున్నాయని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలాపురంలో జరగనున్న సున్నావడ్డీ రాయితీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనుబాబు, వీఓఏలు పాల్గొన్నారు.

వంట పాత్రల బహూకరణ



వంట పాత్రలు బహూకరిస్తున్న ఉపాధ్యాయురాలు పల్లాలమ్మదేవి

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వినియోగార్థం ఉపాధ్యాయురాలు ఎ.పల్లాలమ్మదేవి వంట పాత్రలను బహూకరించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె రూ.15 వేల విలువైన వంట పాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మంచిగంటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్వాయర్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



క్వాయర్ ఇండస్ట్రీస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న కొబ్బరిపీచు

అల్లవరం: మండలంలోని తూర్పులంక హనుమాన్ క్వాయర్ ఇండస్ట్రీస్‌లో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగి యంత్రాలు, కొబ్బరిపీచు మంటల్లో కాలిపోయాయి. వెల్డింగ్ పనులు నిర్వహిస్తుండగా నిప్పురవ్వలు కొబ్బరిపీచుపై పడి ప్రమాదం జరిగిందని పరిశ్రమ కూలీలు చెబుతున్నారు. ప్రమాదంపై అమలాపురంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అయితే ఇదే పరిశ్రమలో తరచుగా అగ్ని ప్రమాదాలు జరగడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న సర్పంచ్ వెంకటరావు

అల్లవరం: పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే గర్భిణులు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సర్పంచ్ సాధనాల వెంకటరావు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దేవగుప్తం పంచాయతీ పరిధిలోని గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరావు మాట్లాడుతూ గర్భిణులకు రూ.850 విలువ చేసే పది రకాల పోషకాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించి స్వీట్లు, చీర, పండ్లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, పద్మావతి, మంగాయమ్మ, మరియమ్మ, నాగలక్ష్మి, నాగరత్నం పాల్గొన్నారు.

అధిక ధరలపై ఫిర్యాదు

తాళ్లరేవు: మండల పరిధిలోని నీలపల్లి పంచాయతీలో ఉన్న సత్యా థియేటర్‌లో అల్పాహారాలు, ఇతర ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఆదిమూలం శ్రీనివాస్ అనే వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేశారు. తాగునీరు, కూల్‌డ్రింకులతో పాటు పాప్‌కార్న్, ఐస్‌క్రీమ్‌లను రెట్టింపు ధరకు అమ్ముతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కొత్త సినిమాల విడుదల సమయంలో ధరల దోపిడీ మరీ ఎక్కువగా ఉంటుందని, అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేతన్న నేస్తంతో చేయూత

- చేనేత కార్మికులకు ఐదో విడత సాయం పంపిణీ
- నాలుగన్నరేళ్లలోనే ఐదు దఫాల సొమ్ము జమ



బండారులంకలో చేనేత వస్త్రాలు తయారుచేస్తున్న చేనేత కార్మికులు

అమలాపురం రూరల్: చేనేతను నమ్ముకున్న నేత కార్మికుల కుటుంబాల పోషణ బాధ్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారు. 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత ప్రభుత్వాలేవీ చేయని విధంగా నేత కార్మికులకు ఆర్థిక సాయం చేస్తూ అండగా నిలబడ్డారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ఇప్పటికే నాలుగు దఫాలు సాయం అందించిన ప్రభుత్వం తాజాగా ఐదో విడతగా ఒక్కో కుటుంబానికి రూ.24 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో 1,419 చేనేత కుటుంబాలకు రూ.34.56 లక్షల సాయాన్ని అందజేసింది.

అండగా 'నేతన్న నేస్తం' పథకం

ప్రతి నేతన్న కుటుంబానికి నెలకు రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని 2019 డిసెంబర్ 21న ప్రారంభించింది. 2019లో తొలి విడతగా కుటుంబానికి రూ.24 వేలు చొప్పున జమచేసింది. రెండో విడతగా 2020 డిసెంబర్‌లో ఇవ్వాల్సి ఉన్నా కరోనా నేపథ్యంలో ముందుగానే 2020 జూన్ 20న సాయం అందజేసింది. మూడో విడత సాయాన్ని 2021 ఆగస్టు 9న, నాలుగో విడత 2022 ఆగస్టు 28న పంపిణీ చేశారు. ఐదో విడతగా ఈ ఏడాది జులై 21న 1419 మందికి రూ.34.56 లక్షలు అందజేశారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో 8 చేనేత సహకార సంఘాల్లో కలిపి 1800 మంది సభ్యులున్నారు. మాస్టర్ వీవర్స్ ద్వారా మగ్గాలపై వస్త్రాల తయారీ సాగుతుంది. వీరిలో మగ్గాలున్న కార్మికులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో సాయం అందుకుంటున్నవారి వివరాలు

మండలాలు	నేతన్న సాయం అందుకున్న కార్మికులు
అమలాపురం రూరల్	819
అల్లవరం	8
ఉప్పలగుప్తం	177
ముమ్మిడివరం నగర పంచాయతీ	44
ముమ్మిడివరం	80
కాట్రేనికోన	125
ఐ.పోలవరం	53
తాళ్లరేవు	113
మొత్తం	1419

క్రమం తప్పకుండా సాయం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి విడతగా 2019లో రూ.24 వేలు సాయం చేశారు. అప్పటి నుంచి ఐదు విడతలుగా సాయం అందజేస్తూనే ఉన్నారు. కరోనా కాలంలో ఆరు నెలలు ముందే సొమ్ము జమ చేశారు. మొత్తంగా ఒక్కో నేతన్న కుటుంబానికి రూ.1.20 లక్షల సాయం అందింది. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం

– కూర్మ వీరవేణి, చేనేత కార్మికురాలు, బండారులంక

నాలుగన్నరేళ్లలోనే ఐదు దఫాలు



తన పాలన పూర్తయ్యే ఐదేళ్లలోపు ఏడాదికి రూ.24 వేలు చొప్పున సాయం చేస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు హామీ ఇచ్చారు. ఆయన పాలనాకాలం ఐదేళ్లు పూర్తి కాకుండానే ఐదు విడతల సాయాన్ని పంపిణీ చేశారు. చేనేత చరిత్రలో ఇలాంటి సాయం ఏ ప్రభుత్వమూ చేయలేదు. కార్మికులకు భరోసా కల్పించారు.

– చింతా ఉమా మహేశ్వరరావు, బండారులంక చేనేత సహకార సంఘం అధ్యక్షుడు

ఘనంగా లక్ష్మణస్వామి జయంతి వేడుకలు



లక్ష్మణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. లక్ష్మణస్వామి స్వాతంత్ర్యం రాక ముందే సంఘాన్ని స్థాపించి అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించారని స్థానిక సంఘం అధ్యక్షుడు పెమ్మాడి సాయిబాబు అన్నారు. తొలుత లక్ష్మణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయంతి వేడుకల్లో కొపనాతి వెంకటరాజు, దర్మాడి వీర్రాజు, కొపనాతి లక్ష్మణరావు, బొమ్మిడి బాబూరావు, అంగాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

తాళ్లరేవు: పొన్నమండ లక్ష్మణస్వామి 154వ జయంతి కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామమైన కోరంగిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పెద బొడ్డు వెంకటాయపాలెంలోని లక్ష్మణస్వామి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ కోరంగిలో లక్ష్మణస్వామివర్మ, మల్లాడి సత్యలింగ నాయకర్ విగ్రహాల ఏర్పాటుకు తనవంతుగా రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పట్టా ఆదినారాయణ వర్మ, వైదాడి నూకరాజు, పొన్నమండ రామలక్ష్మి, కామాడి మాతరాజు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: పొన్నమండ లక్ష్మణస్వామి 154వ జయంతి వేడుకలను బలుసుతిప్పలో సోమవారం అగ్నికుల క్షత్రియులు ఘనంగా జరుపుకున్నారు.

రాష్ట్రపతి ముర్ముకు ఘన స్వాగతం



పుదుచ్చేరిలో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలుకుతున్న సీఎం రంగసామి

యానాం: రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సోమవారం పుదుచ్చేరి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విమానాశ్రయంలో లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రంగసామి, మంత్రులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వివిధ పోలీసు దళాలతో గౌరవ వందనాన్ని స్వీకరించారు. పౌర సన్మానం అనంతరం ఆమె మాట్లాడుతూ పుదుచ్చేరిలో తమిళం, తెలుగు, మళయాళం సంస్కృతి, సాంప్రదాయాల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. అలాగే ఆధ్యాత్మికంగా, యోగాపరంగానూ పేరుగాంచిందన్నారు. అనంతరం జిప్‌మెర్‌ను సందర్శించి అక్కడ రూ.17.01 కోట్లతో నెలకొల్పిన అడ్వాన్స్‌డ్ రేడియోథెరపీ మిషన్‌ను ప్రారంభించారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే రోజుకు 80 నుంచి 100 మంది కొత్త కేన్సర్ రోగులకు రేడియోథెరపీని నిర్వహించవచ్చన్నారు. అనంతరం ప్రఖ్యాత మునకుల వినాయగర్ ఆలయాన్ని సందర్శించి విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విలేజ్, తిరుకంచి ఆలయాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



అమలాపురంలో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న జిల్లా దళిత ఐక్య వేదిక ప్రతినిధులు



ఉంద్రు ఆశీర్వాద్ వేసిన గద్దర్ చిత్రం

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం జిల్లా దళిత ఐక్య వేదిక జిల్లా చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇసుకపట్ల రఘుబాబు, మెండు రమేష్‌బాబు, గూటం సాయి, బొంతు రవికుమార్, గిడ్ల వెంకటేశ్వరరావు, ములపర్తి సత్యనారాయణ, ముత్తాబత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరని లోటు

అమలాపురం టౌన్: అణగారిన ప్రజల కోసం తన పాటల ద్వారా చైతన్యం నింపిన వాగ్గేయకారుడు గద్దర్ మరణం రాష్ట్రానికి తీరని లోటని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గద్దర్ హఠాన్మరణం వ్యక్తిగతంగా తనఎంతో బాధించిందని తన సంతాపం తెలియజేశారు.

ముమ్మిడివరం: స్థానిక బుద్ధ పార్కులో గద్దర్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్ మృతి తెలుగు రాష్ట్రాల ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందని విశ్వజన కళా మండలి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు అన్నారు. కార్యక్రమంలో కేఎస్ఎన్ మూర్తి, మట్టా వెంకటరావు, ఎడ్ల కుటుంబరావు, మెండి కమల, రేవు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండల కేంద్రంలో మండల మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, కొంకి వెంకట బాబ్జి, పెయ్యిల కొండబాబు, పండు రాజేష్ పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ప్రజా గాయకుడు గద్దర్‌కు అమలాపురానికి చెందిన చిత్రకారుడు ఉంద్రు ఆశీర్వాద్ చిత్ర నివాళి అర్పించారు.

కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలి



రొయ్యల కంపెనీల యజమానులతో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలోని రొయ్యల కంపెనీల్లో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో రొయ్యల కంపెనీల కాలుష్యంపై పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై సోమవారం చర్చించారు. మండల పరిషత్ కార్యాలయంలో రొయ్యల కంపెనీల యాజమాన్యాలతో ఎంపీపీ సునీత సమావేశం నిర్వహించారు. ప్రధానంగా కంపెనీల నుంచి శుద్ధి చేసిన నీటినే బయటకు వదలాలని, గుడ్డివానితూము సెంటర్‌లో దుర్వాసన లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, టి.ఈశ్వరరావు, రత్స ముత్యాలు, పాలెపు చినపోశియ్య మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, ఏఓ మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి

తాళ్లరేవు: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేసే సేవలు ఎనలేనివని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. పి.మల్లవరం హైస్కూల్ నుంచి 10 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన నేపథ్యంలో సోమవారం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు, గ్రామ ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ, హెచ్ఎం పి.శ్రీనివాసరావు, ఓలేటి కుమార్ పాల్గొన్నారు.



పి.మల్లవరం హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చేనేత కార్మికులకు అండగా జగనన్న ప్రభుత్వం

ఉప్పలగుప్తం: చేనేత కార్మికులకు అండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని విలసవిల్లి గ్రామంలో చేనేత కార్మికులు నిర్వహించిన సమావేశానికి సర్పంచ్ ఊర్మిళాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న చేనేత కార్మికుల సమస్యలను గుర్తించి నేతన్న నేస్తం, చేయూత వంటి పథకాలను ప్రవేశపెట్టి అన్ని విధాలా సహకరిస్తున్నారన్నారు. నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, చేనేత సొసైటీ అధ్యక్షుడు పుత్సల ఏసు, బళ్ల నాగసతీష్, యాళ్ల సత్తిబాబు, కోలా ఏసు, ఆశపు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: చేనేత కార్మికులు తమ కాళ్లపై తాము నిలబడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టి ఏటా రూ.24 వేలు వారి ఖాతాల్లో వేస్తున్నారని బండారులంక ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్ అన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా బండారులంక చేనేత సొసైటీ వద్ద చేనేత సంఘం అధ్యక్షుడు చింతా ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో చేనేత కార్మికుల దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్తుల జానకీలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీను, మాజీ ఎంపీపీ ఊటుకూరు సుబ్రహ్మణ్యం, సహకార సొసైటీ అధ్యక్షుడు కండిబోయిన వెంకటేశ్వరరావు, సరెళ్ల రామకృష్ణ, దంగేటి బుల్లబ్బులు, జాన గణేష్, చందన శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి విశ్వరూప్‌కు రాట్నం బహూకరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగ అధ్యక్షుడు నాగశ్రీనివాసరావు

మంత్రి విశ్వరూప్‌కు చేనేత రాట్నం బహూకరణ

చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లకు బండారులంకకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగ అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు చేనేత రాట్నం బహూకరించారు.

చేనేత కార్మికులకు ఘన సత్కారం

తాళ్లరేవు: జాతీయ చేనేత దినోత్సవాన్ని ఇంజరం పంచాయతీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చేనేత సహకార సంఘం కార్యాలయంలో సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ చేనేత కార్మికులను దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరామప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చేనేతలకు అత్యధిక లబ్ధి చేకూరిందన్నారు. చేనేత కార్మికులందరూ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోరుకొండ చంటి, పెయ్యల కొండబాబు, జట్ల ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ముద్రగడ ప్రసాద్, సహకార సొసైటీ కార్యదర్శి బళ్ల కోటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత దినోత్సవం

అమలాపురం రూరల్ : మండలంలోని బండారులంకలో బీజేపీ నాయకులు ఆర్వీ నాయుడు, కాశిన ఫణీంద్రల ఆధ్వర్యంలో చేనేత కార్మికులు కొండా తిరునాథులు, వరలక్ష్మి, గొల్ల శేషరత్నం, బండారు శారదలను సత్కరించారు.



విలసవిల్లిలో చేనేత దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి



బండారులంకలో చేనేత కార్మికులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ చేనేత సంఘం నాయకులు



ఇంజరంలో చేనేత కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్ తదితరులు

తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవి



తల్లిపాల వారోత్సవాల ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని, తల్లి పాలు తాగే శిశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని మదర్‌థెరిస్సా పోస్టు గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో తల్లి పాల ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గిరియాంపేట గ్రామ ఆరోగ్యకేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సామూహిక ఆరోగ్య విద్యా కార్యక్రమంతో పాటు తల్లిపాల విశిష్టతపై నాటకం ద్వారా అవగాహన కల్పించారు. దరియాలతిప్ప, జీజీహెచ్‌ల్లో సైతం నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం డబ్బా పాలు వద్దు తల్లి పాలు ముద్దు అనే నినాదంతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కనకాల శ్రీనివాస్, సీఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వేను తనిఖీ చేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, మృతుల పేర్లు తొలగింపు నిమిత్తం జరుగుతున్న ఇంటింటి సర్వేను రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి తనిఖీ చేశారు. నియోజకవర్గ పరిధిలో 33 బూత్‌ల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు సర్వే నిర్వహిస్తున్నారు. స్థానిక అయ్యన్ననగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం వద్ద మజ్జిగ అందిస్తున్న వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం స్పందనకు వచ్చిన అర్జీదారుల కోసం చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి వందలాది మంది దాహార్తిని తీర్చారు. వెంకటేశ్వరరావు దంపతులను కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఆర్వో సత్తిబాబు తదితరులు అభినందించారు.

గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం



కాట్రేనికోన గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన గ్రంథాలయంలో సోమవారం 'గ్రంథాలయంలో చదవడం మాకిష్టం' అనే కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు వేమన, సుమతీ శతకాలు పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కాట్రేనికోన గ్రంథాలయాధికారిణి కె.తులసీ లక్ష్మి అందజేశారు.

నేడు యానాంలో గద్దర్ సంస్మరణ సభ

యానాం: ప్రజా కవి గద్దర్ సంస్మరణ సభను మంగళవారం యానాం బుద్ధ పార్క్ వద్ద అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు భారతీయ దళిత సాహిత్య అకాడమీ దక్షిణ భారత దేశ కమిటీ అధ్యక్షుడు కలైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు జానపద పాటలతో ఆయన రాసిన మాటలు తూటాలుగా జనం గుండెల్లో నిలిచిపోయాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: తపాలా శాఖలో ఉద్యోగాలకు పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 40 ఏళ్ల వయసున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ సలాది శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమలాపురం పోస్టల్ డివిజన్‌లో ఉన్న 7 బ్రాంచి పోస్టుమాస్టర్, 6 అసిస్టెంట్ బ్రాంచి పోస్టు మాస్టర్, 5 డాక్ సేవక్ పోస్టులను భర్తీ చేయనున్నారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.